



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. శనివారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

-కీసర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి)



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

దుద్యాల/దౌల్తాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం దుద్యాల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా భూ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త చట్టం ఎంతో దోహదపడుతుందన్నారు. జూన్ రెండో తేది నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్మాణంలోని మండల కార్యాలయాల సముదాయ భవనాలను పరిశీలించారు. డంపింగ్ యార్డును మార్చేందుకు వేరే స్థలాన్ని పరిశీలించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్‌నాయక్, ఎంపీడీవో మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

కొత్త చట్టంతో పొరపాట్ల సవరణకు అవకాశం లభించిందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ పీఏసీఎస్ భవన సముదాయ ఆవరణలో జరిగిన భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, ఆర్‌ఓఆర్ మార్పులు, చేర్పులు, సాదాబైనామా లాంటి సేవలు సులభతరంగా అవుతాయన్నారు. 3 నెలల్లో రెవెన్యూ యంత్రాంగం ప్రతీ సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల పనులు, గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్న వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా రైతులు వెంకట్రావ్, బసప్ప, రెడ్డి శ్రీనివాస్‌లు భూ భారతి నూతన చట్టం చాలా సరళీకృతంగా ఉందని, ఈ చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏవో లావణ్య, వెంకట్రావ్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు 7

తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ



ప్రతీ ఒక్కరికి సహజంగానే తమ భవిష్యత్ గురించి తెలుసుకోవాలనే ఆత్రుత, ఆసక్తి ఉంటుంది. గతంలో ఇందుకు చిలుక జ్యోతిషులనే సంప్రదించేవారు. పంజరంలో చిలుకతో జాతకాలు చెబుతామంటూ పల్లెల్లో కనిపించేవారు. అప్పట్లో జాతకాలపై నమ్మకంతో పోటీపడి మరీ చెప్పించుకునేవారు. దాంతో వారికి కడుపునిండా అన్నం మెతుకులు, తిండి గింజలు, జేబునిండా డబ్బులు దొరకేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. మార్కెట్‌లోకి హైటెక్ జ్యోతిష్యులు రావడం.. ప్రజల్లో ఆసక్తి తగ్గడంతో చిలుక జ్యోతిషుల జీవితాలు దుర్భరంగా మారాయి. అటు ఉపాధి దొరక్క, ఇటు జ్యోతిషానికి ఆదరణ లేక అల్లాడుతున్నారు. చిలుక జ్యోతిషుల బతుకు చిత్రంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం.



పరిగి మార్కెట్‌లో చిలుక జాతకం చెబుతున్న దృశ్యం

జాతకం

బతుకు చిత్రం

తారుమారు!

కనుమరుగవుతున్న చిలుక జ్యోతిషులు

45 ఏళ్లుగా చిలుకతోనే జీవితం



నా పేరు అరెబేళ్ల జగన్నాథం. బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామం. పరిగి పట్టణంలో స్థిరపడ్డాం. భార్య నాగమ్మ.. ముగ్గురు మగ, ఇద్దరు ఆడ పిల్లలు. మా తాతముత్తాల నుంచి చిలుక జాతకం వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. నేను కూడా 45 ఏళ్లుగా జాతకాలు చెబుతూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాను. గతంలో ఏ ఊరికి వెళ్లినా కడుపునిండా అన్నం మెతుకులు, తిండి గింజలు, జేబునిండా డబ్బులు వచ్చేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఇప్పుడు ఆదాయం అసలే లేదు. పొద్దస్తమానం తిరిగినా రూ.50 రావడం లేదు. పూటగడవడమే భారంగా మారింది. భార్య కూలి డబ్బులతో పిల్లలను సాకుతున్నాం. ఇప్పటికీ మాకు సొంతిళ్లు కూడా లేదు. గుడారం వేసుకొని ఉంటున్నాం. పెద్ద కొడుకు మహేశ్ బాబును ఆరు వరకు చదివి, వాడు కూడా చిలుకజాతకం వృత్తినే ఎంచుకున్నాడు. చిన్న పిల్లను సర్కారు స్కూల్లో చదివిస్తున్నాను. వేరే పనికి వెళ్లలేక, ఈ వృత్తిని వదులుకోలేక అష్టకష్టాలు పడుతున్నాం.

గతమెంతో ఘనం.. నేడు దుర్భరం

- వృత్తినే నమ్ముకొని సాగిస్తున్న జీవనం
- రోజంతా తిరిగినా పూట గడవని దుస్థితి
- ఉమ్మడి జిల్లాలో సుమారు 400 కుటుంబాలు
- మార్కెట్‌లోకి హైటెక్ ఆస్ట్రాలజర్స్
- నానాటికి ప్రజల్లో తగ్గుతున్న ఆసక్తి
- చిలుక జ్యోతిషుల బతుకు చిత్రంపై ప్రత్యేకం



పరిగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఓ చిలుకా.. రామ చిలుకా.. మీదే జాతకం అంటూ గ్రామాల్లో సంచరించే చిలుక జ్యోతిషుల జీవనం దుర్భరంగా మారింది. ఒకప్పుడు మంచి ప్రాధాన్యతతో పాటు గిట్టుబాటు సంపాదన ఉండేది. అప్పట్లో జనం కూడా చిలుక జాతకంపై నమ్మకంతో ఉండేవారు. పంజరంలో చిలుకను పెట్టుకొని తిరుగుతూ వాటిచేత బొమ్మల కాగితాలు తీయించి ప్రజలకు భవిష్యత్తు గురించి చెప్పేవారు. వచ్చే కాసింత డబ్బుతో కుటుంబాలను వెళ్లదీసేవారు. ఏ గ్రామానికెళ్లినా జనం పోటీపడి జాతకం చెప్పించుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మార్కెట్‌లోకి హైటెక్ జ్యోతిషులు రావడంతో చిలుక జ్యోతిషం చెప్పే వారికి ఆదరణ పూర్తిగా తగ్గింది. అయితే ఈ వృత్తిని వదులుకోలేక, మరో వృత్తిని ఎంచుకోలేని అనేక కుటుంబాలు పూటకు

మిగతా 7వ పేజీలో...



ఉల్లి పంటను ఆరబెడుతున్న రైతు

అకాల వర్షం.. ఆగమాగం

వికారాబాద్/మర్పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఉల్లి సాగు చేసిన రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. మర్పల్లి మండలంలో దాదాపు 1000 ఎకరాలకు పైగా ఉల్లి పంటను సాగు చేశారు. దిగుబడి ప్రస్తుతం చేతికి వచ్చే సమయంలో మద్దతు ధర లేకపోవడంతో రైతులు పొలాల గట్లపై నిల్వ చేశారు. అకాల వర్షాలకు నిల్వ చేసిన ఉల్లి తడిసిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏటా అకాల వర్షాల కారణంగా ఉల్లి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలాగే, వికారాబాద్ పట్టణంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి. పట్టణంలోని ఎంఆర్‌పీ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్ బూత్ కింద పడిపోయింది. సాయంత్రం అయితే చాలు గాలివానతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

పశుగ్రాసానికి పరేషాన్!

మేడ్చల్ జిల్లాలో తీవ్రమవుతున్న కొరత

- పరిసర జిల్లాల నుంచి కొనుగోలు
- ట్రాక్టర్లు, డీసీఎంలలో తరలిస్తున్న ఎండుగడ్డి
- రూ.8 వేలు పలుకుతున్న ట్రాక్టర్ గ్రాసం
- ఆందోళనలో పాడి రైతులు, వ్యాపారులు



ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీల్లో తరలుతున్న పశుగ్రాసం

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగ్రాసం కొరత సమస్య తీవ్రమవుతోంది. ఓ వైపు మండుతున్న ఎండలు మరో వైపు పశుగ్రాసం దొరక్క పశువులు అల్లాడుతున్నాయి. జిల్లాలో సాగుకు బోరుబావులే ఆధారం. దాంతో ప్రభుత్వం వరిసాగు చేయొద్దని, ఆరుతడి పంటలు వేయాలని విస్తృత ప్రచారం చేయడంతో రైతులు ఈసారి ఎక్కువగా వరిపై దృష్టి సారించలేదు. దీంతో జిల్లాలో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. మేడ్చల్ జిల్లా నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో రియల్ వ్యాపారంతో పొలాలు మాయమయ్యాయి. ఇక్కడ వ్యవసాయ ఆధారిత కుటుంబాలు తక్కువగా ఉన్నా పాడి పరిశ్రమ ఎక్కువగానే ఉంది. దీంతో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది.

ట్రాక్టర్ గడ్డికి రూ.8వేలు

మేడ్చల్ పరిసర గ్రామాల్లో పశుగ్రాసం కొరతతో ఇక్కడి రైతులు, పాడి వ్యాపారులు పక్క

మిగతా 8వ పేజీలో...

పాల దిగుబడి తగ్గింది



వేసవిలో పశుగ్రాసం సమస్య తీవ్రమైంది. నగర శివారులో వ్యవసాయం తక్కువగా ఉండటంతో పరిసర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. మెదక్, కామారెడ్డి, నల్గొండ జిల్లాల నుంచి ట్రాక్టర్లు, డీసీఎంల ద్వారా తెప్పిస్తున్నాం. ఒక్కో పశువుకు రోజుకు ఒక్కో కట్ట వేయాల్సి వస్తోంది. మరో రెండు నెలల పాటు పశుగ్రాసం కోసం తిప్పలు తప్పవు. మరోవైపు పాల దిగుబడి కూడా తగ్గింది.

-బి.రమేశ్, పాడిరైతు, మర్పల్లిగూడ

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి



ఖైదీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆయన శనివారం పరిగి పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షణికావేశంతో చేసిన తప్పులతో జైలు శిక్ష అనుభవిస్తూ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇప్పటికైనా ఖైదీల్లో మార్పు వచ్చి స్నేహభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సబ్ జడ్జి వెంకటేశ్వర్లు, పరిగి న్యాయమూర్తి శిల్ప, సూపరిండెంట్ రాజ్‌కుమార్, లీగల్ సర్వీస్ డిఫెన్స్ కౌన్సిల్స్ వెంకటేశ్, రాము, శ్రీనివాస్, గౌస్‌పాష, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి




మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సీసీటీఎన్‌ఎస్ 2.0లో ఎలాంటి పెండింగ్ లేకుండా కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అలాగే డిజిటల్ సిగ్నేచర్ చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ పెండింగ్ కేసుల పురోగతి వంటి ముఖ్యమైన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దొంగతనాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పెట్రోలింగ్ వాహనాలు బ్లూ కోట్స్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బహిరంగ వేలం

ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకతతో బహిరంగ వేలం నిర్వహించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు విడి భాగాల బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధీనంలో ఉండి, వినియోగానికి పూర్తిగా పనికి రాని పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు, ఇతర విడి భాగాలను ఈ విధంగా వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, ఆర్‌ఐలు అంజాత్ పాషా, డేవిడ్ విజయ్, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, నవీన్ మిట్టల్ దంపతులు, భక్తులు

- ఘనంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి పరిణయం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

కీసర, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని చీర్యాల్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు ఉదయం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం నృసింహఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ వేడుకలో రాష్ట్ర భూ పరిపాలన, రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్, కేంద్ర మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలతో పాటు అశేష భక్తజనులు పాల్గొన్నారు. కాగా, నేడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పూర్ణాహుతి, శతఘటాభిషేకం అలంకరణ, పంచ హారతులు, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు.

భారత్ సమ్మిట్‌లో ఎంపీ, ఎమ్మెల్యే



ఆమనగల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ హెచ్‌సీఐలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025లో శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ సభ్యుడు మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కల్పిస్తున్న అవకాశాలతో అనేక విదేశీ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని రవి అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఫేక్ నంబర్ ప్లేట్‌తో నిలువు దోపిడీ

- షాద్‌నగర్ వ్యక్తి కారు నంబర్‌ను బైక్‌కు వేసుకొని చోరీలు
- అడ్డా కూలీల మహిళలే టార్గెట్ చేసుకున్న దుండగుడు
- పోలీసులకు సవాల్‌గా వరుస దొంగతనాలు



మహిళను బైక్‌పై తీసుకెళ్తున్న నిందితుడు(ఫైల్)



చెవి కమ్మలు లాక్కున్నాడని చూపుతూ రోదిస్తున్న మహిళ



నిందితుడు వాడుతున్న బైక్ నంబర్

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కారు నంబర్‌ను బైక్‌కు తగిలించుకొని ఓ దుండగుడు చోరీలకు పాల్పడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. షాద్‌నగర్ శివారు మరియా రాణి పాఠశాల పక్కన శ్రీనివాసులు నివాసం ఉంటున్నాడు. కొంత కాలం కింద కారు కొన్నాడు. ఆ కారు నంబర్ టీఎస్07 హెచ్‌జడ్0247. ఇదే నంబర్‌ను ఓ దుండగుడు బైక్‌కు పెట్టుకుని కూలీ అడ్డాల వద్ద ఉండే మహిళలను పనిఉందని బైక్ ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుంటున్నాడు. కొందరి చెవి కమ్మలను లాక్కోగా వారికి గాయాలయ్యాయి. ఈ దుండగుడు ఇప్పటి వరకు జడ్చర్ల, సిద్దిపేట, చేవెళ్ల, నల్లగొండ జిల్లాల్లో నిలువు దోపిడీలకు పాల్పడినట్లు తేలింది. బైక్ నంబర్ ఆధారంగా మూడు రోజుల కింద సిద్దిపేట పోలీసులు షాద్‌నగరొచ్చి కారుయజమానిని ప్రశ్నించారు. ఆ నంబరున్న బైక్ తనది కాదని శ్రీనివాసులు పోలీసులతో వాపోయాడు. దొంగ బైక్‌కు తన కారు నంబర్ ఉండడంతో వివిధ జిల్లాల పోలీసులు తన ఇంటికొస్తున్నారని, చేయని తప్పునకు పోలీసు విచారణతో తనకు ఇబ్బందికరంగా ఉందని శ్రీనివాస్ వాపోయాడు. దీనిపై షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనాల మారు నంబర్ ప్లేట్లతో చోరీలు జర గడం ఈ ప్రాంతంలో ఇదే కొత్త అన్నారు. చోరీపై సిద్దిపేట పోలీసులు తమకు సమాచారమిచ్చారని చెప్పారు. షాద్‌నగర్‌లో కూలీల అడ్డాలు, ఇతర చోట్ల నిఘాపెట్టామని చెప్పారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



కడ్తాల్‌లో సర్వేను పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు/కడ్తాల, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. అధికారులు నిబంధనల మేరకే నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలం గౌరారం, కడ్తాలలో శనివారం సీఈవో పర్యటించారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తీరును పరిశీలించారు. సర్వే ఫారాల్లో వివరాలను సమగ్రంగా పొందుపర్చాలన్నారు. ఇందిరమ్మ కమిటీల జాబితా ఆధారంగా నిర్వహిస్తున్న సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దని చెప్పారు. అర్హులకే ఇళ్లు కేటాయించాలన్నారు. సర్వే వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మాధురి, సుజాత, ఎంపీవోలు లాలయ్య, వినోద, పంచాయతీ కార్యదర్శులు అల్లాజి తదితరులు పాల్గొన్నారు. అలాగే కడ్తాల్ మండల ముద్విన్‌లో సర్వేను స్పెషలాఫీసర్ మహేందర్‌రెడ్డి, పీఎస్ జగదీశ్ పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి దరఖాస్తుదారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, యాదయ్య, శ్రీశైలం, నర్సిరెడ్డి,వెంకటయ్య, నర్సింహ, మల్లేశ్, సురేందర్‌రెడ్డి, మనీశ్‌రెడ్డి, ఆనంద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

29న సామాజిక తనిఖీ ప్రజావేదిక

తలకొండపల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ వద్ద ఈ నెల 29న ఉపాధి హామీ పథకం మండల ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు చేసిన పనులపై తనిఖీ 14వ విడత కార్యక్రమం ఈ నెల 12 నుంచి 25వ తేదీ వరకు చేశామన్నారు. చేపట్టిన పనులు, నిధుల ఖర్చు, సామాజిక తనిఖీ నివేదికను బహిరంగ ప్రజావేదికలో అందజేస్తామన్నారు. అధికారులు, కూలీలు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


జె.జంగయ్య(ఫైల్)

పూడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన పూడూరు మండలంలోని కడుమూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడుమూరు గ్రామానికి చెందిన జొన్నాడ జంగయ్య(40) మధ్యాహ్నం 2గంటల సమయంలో తన పొలం వద్ద ఉన్న బోరు మోటారును ఆన్ చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు స్టార్టర్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జంగయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రామకృష్ణ

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఆమగల్లు/కడ్తాల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సెంట్రల్ క్వాలిటీ కంట్రోల్ సభ్యుడు రామకృష్ణ అధికారులకు సూచించారు. శనివారం ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో పర్యటించారు. ఆయా మండల పరిషత్‌లలో ఈజీఎస్ రికార్డులను పరిశీలించారు. అనంతరం సింగంపల్లి ఊరగుట్టలో ప్లాంటేషన్ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవోలు సుజాత, మాధురి, చేవెళ్ల ఏపీడీ చరణ్‌గౌతమ్, డీఆర్‌డీఏ అధికారి శ్వేత, సునీత, ఏపీవోలు తదితరులు ఉన్నారు.


ఈవోకు వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతులు

ఆలయ భూములకు కౌలు ఇవ్వలేం

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రైతులకు 37ఎ టెనెంట్ చట్టం ఉండగా కౌలు ఇవ్వాలని బలవంతపెట్టొద్దని, తాము కౌలు ఇవ్వలేమని ఆలయ భూమి సాగు చేసుకుంటున్న నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాటిపర్తి రైతులు అన్నారు. శనివారం నందివనపర్తిలో ఓంకారేశ్వరాలయ ఆలయ ఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. టెనెంట్ హక్కు ఉండగా కౌలు ఎందుకివ్వాలో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. కౌలు విషయంలో తాము కోర్టులో కేసు పెట్టామని పేర్కొన్నారు. కౌలు చెల్లించాలని దండోరా వేయించడం సరికాదన్నారు. రైతులు చెన్నయ్య, బుగ్గరాములు, యాదయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.


మహిళతో మాట్లాడుతున్న బాబయ్య

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య తెలిపారు. 'గావ్ చలో-బస్తీ చలో..' కార్యక్రమంలో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లిని నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మోదీ దేశానికి సుస్థిరపాలన అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సందర్శించి అందిస్తున్న పౌష్టికాహారంపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో కె.వెంకటేష్‌గుప్తా, కుర్మయ్య, రాజు, అజయ్, సురేశ్ పాల్గొన్నారు.


తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు సత్యనారాయణ, నిర్మల, నాగరాజు

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

తాండూరురూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మల్కాపూర్‌లో నాపరాతి గనుల్లో అక్రమంగా తవ్వకాలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని తాండూరు మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం మల్కాపూర్‌లో సర్వే నంబర్-75లో మంచన్పల్లి ఎల్లమ్మ భూమిలో రాములు నాపరాతి తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఏడీ, అసిస్టెంట్ జియాలజిస్ట్ నాగరాజు బృందం తనిఖీ నిర్వహించింది. నాపరాతి గనికి తీసుకున్న విద్యుత్ కనెక్షన్ కట్ చేయించారు. దీనిపై వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏడీ చెప్పారు.



జాతకం తారుమారు!

(ఐదో పేజీ తరువాయి)

మెతుకులు పుట్టని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రస్తుతం జనాలు చిలుక జాతకాలను మరచిపోతున్న పరిస్థితి. ఇప్పుడున్న పరిస్థితుల తగ్గట్టు హైటెక్ జ్యోతిషులు అందలమెక్కుతుంటే, నాటి నుంచి నేటి వరకు చిలుకనే నమ్ముకున్న జ్యోతిష్యుడి బతుకులు అంధకారంలో మగ్గుతున్నాయి.

సుమారు 400 కుటుంబాలు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 400 చిలుక జ్యోతిషుల కుటుంబాలున్నాయి. వికారాబాద్ జిల్లాలో దాదాపుగా వందకుపైగా ఉన్నాయి. పరిగి, తాండూరు, బషీరాబాద్, కొడంగల్, వికారాబాద్ ప్రాంతాల్లో చిలుక జ్యోతిషులు జీవనం కొనసాగిస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో సుమారు 250 నుంచి 300 కుటుంబాలు ఉన్నాయి. జహీరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చి శంషాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ నియోజకవర్గాల్లో వారు స్థిరపడ్డారు. అలాగే మేడ్చల్ జిల్లాలోని కీసరలో 8 కుటుంబాలు ఉన్నాయి. వీరంతా పట్టణ ప్రాంతాల్లో నివస్తూ నిత్యం గ్రామాల్లోకి వెళ్తున్నారు. పరిగి పట్టణంలోని మార్కెట్ యార్డులో నిత్యం చిలుకతో జోతిషం చెబుతూ కనిపిస్తున్నారు. చిలుకలతో చుట్టుపక్కల గ్రామాలు తిరుగుతూ జ్యోతిషం చెబుతూ వచ్చే కాసిన్ని డబ్బులతో పూటగడుపుతున్నారు. ప్రజల్లో నానాటికీ చిలుక జోతిషంపై ఆసక్తి తగ్గుతుండటంతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి.

పూట గడవడం కష్టంగా ఉంది



పాలమూరు జిల్లా నుంచి పరిగికి వచ్చాను. 40 ఏళ్లుగా చిలుక జాతకంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇప్పుడు రోజంతా కూర్చుంటే వంద రూపాయలు రావడం లేదు. ప్రస్తుతం చిలుక జ్యోతిషం చూపించుకునేందుకు ఎవరూ రావడం లేదు. ఒక్కొక్కరికి ఐదు రూపాయలకు జాతకం చెప్పినా రోజుకు యాభై రూపాయలు కూడా రావడం లేదు. భార్య, పిల్లలను పోషించలేకపోతున్నా. ఒక్కోసారి ఖాళీ కడుపుతో ఉండాల్సిన పరిస్థితి. ప్రభుత్వం మాకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

- శేఖర్, చిలుక జ్యోతిషుడు,పరిగి

కూలి పనికి కూడా పిలువడం లేదు



జ్యోతిషం చెప్పేందుకు వారానికోసారి పరిగి సంతకు వస్తాను. మా నాన్న బలవంతంతో చిలక జాతకం చెప్పడం వృత్తిగా చేసుకున్న. రోజంతా తిరిగితే రెండు వందలు కూడా రావడం లేదు. అయితే గ్రామాలకు తిగిరితే సగం డబ్బులు చార్జీలకే అవుతున్నాయి. కొన్నాళ్లు కూలి పని చేశాను. కొందరు అయితే చిలుక జ్యోతిష్యుడని పనికి వద్దంటున్నారు. చేసేదేమి లేక జ్యోతిషాన్నే నమ్ముకున్న. ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవాలి.

- శ్రీనివాస్, చిలుక జ్యోతిషుడు, పరిగి

బట్టల వ్యాపారం చేసుకుంటున్నా...



మా తాత జెతింగ్‌రావు, నా తండ్రి తుకారామ్ చిలక పంచాంగం చెప్పి కుటుంబాన్ని పోషించేవారు. మా పెద్దల మరణంతోనే జ్యోతిష్యం లేకుండా పోయింది. నేను సుమారు 15 ఏళ్లుగా శంకర్‌పల్లిలోని బట్టల దుకాణంలో పనిచేశాను. ప్రస్తుతం సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నాను. దాంతో పాటుగా రియల్ ఎస్టేట్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను.

-భిక్షపతి, శంకర్‌పల్లి మున్సిపాలిటీ

గుణాత్మక విలువలతోనే వికసిత్ భారత్



విశ్వవిశ్వాని సదస్సులో ప్రసంగిస్తున్న సుధాకర్‌రెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యం సాకారం కావాలంటే గుణాత్మక విలువలతో కూడిన యువ నిపుణులు, విద్యార్థులు చేయూతనివ్వాలని ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తూంకుంటలోని విశ్వవిశ్వాని మేనేజ్‌మెంట్ కాలేజీలో చైర్మన్ శ్రీనివాసచార్య ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్-5.0' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. కీలకాంశంపై జాతీయ సదస్సు నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. దేశం 5.0 వ్యూహాల్లో అనుసంధానం, వనరుల సద్వినియోగంతో గొప్ప పరిణతి సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలు, స్మార్ట్ సిటీల వృద్ధిపై ప్రదర్శనలకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. డిజిటల్ ఆవిష్కరణల్లో యువ నిపుణుల, విద్యార్థుల పాత్ర ముఖ్యమన్నారు. వీవీ విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసచార్య, అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ సహకారం పెంపు, ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. విశ్వవిశ్వాని అధ్యాపకులు రచించిన పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీవీ కాలేజీల కన్వీనర్లు మదన్మోహన్, జాబెజ్, చక్రవర్తి, ఇర్ఫాన్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు?


ప్రవీణ్‌కుమార్‌ను సత్కరించిన బీజేపీ నాయకులు

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అటకెక్కించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు చికోటి ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శనివారం యాచారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రవీణ్‌కుమార్-మాధురిప్రియదర్శి దంపతులు పూజలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం కింద ఇప్పుడిస్తున్న లక్షకు అదనంగా తులం బంగారం ఇస్తామని ప్రతీ ఎన్నికల సభల్లో రేవంత్‌రెడ్డి చెప్పారని, ఇప్పుడు దానిని అమలు చేయడం లేదన్నారు. మరి బంగారం ఇస్తరా, ఇయ్యరా అనేది పాలకులే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్ రాయితీ ఎవరికీ అందడం లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు చీకటి మిత్రుల్లా ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అవినీతిని ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు వెలికితీయడం లేదని ప్రశ్నించారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రధానమంత్రి శ్రమిస్తున్నారన్నారు. ఆయనతో నాయకులు కొప్పు బాషా, తాండ్ర రవీందర్, కృష్ణ, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్‌గుప్తా, అల్వాల్‌రెడ్డి ఉన్నారు.

మతోన్మాదాన్ని అణచివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మీ పండిత్

తాండూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మతోన్మాదాన్ని అణచివేయకపోతే ఉగ్రవాదం పెట్రేగుతుందని సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్ అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం ఏ రూపంలో ఉన్నా అణవేయాలని డిమాండ్ చేశారు. శనివారం తాండూరులో జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఎం.వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని మార్చాలని, పాత చట్టంలో ఎక్కువ జోక్యం అనవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని, సభ్యత్వాలు చేపట్టాలని సూచించారు. పహల్గాంలో ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను తుదముట్టించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్‌లు పిర్‌మహ్మద్, వెంకటేష్, సురేష్, చంద్రయ్య, మునీర్, బషీర్, నర్సింహాబేగం, జగదాంబ, రాజు, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో నాణ్యతకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న నీలిమ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య పరిశోధనలకు బలం చేకూర్చేలా తెలంగాణ ముందడుగు వేసిందని అనురాగ్ యూనివర్సిటీ ఈసీవో సూర్యదేవర నీలిమ అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో శనివారం 'అనుదాబన్-2025' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన పరిశోధనలకు తమ యూనివర్సిటీ వేదిక అయిందని గుర్తుచేశారు. భారత్, సింగపూర్, నెదర్లాండ్స్, జోర్డాన్ దేశాల అధ్యాపకులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ డీన్‌లు బాలాజీ, విష్ణుమూర్తి, వసుధభక్తి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మునివాహన ఉత్సవాలు చేస్తున్నందుకే దాడి

- దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్


మాట్లాడుతున్న అర్చకులు రంగరాజన్

పంజాగుట్ట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దళితులను భుజంపై ఎక్కించుకొని ఆలయంలోకి ప్రవేశింపజేసే మునివాహన ఉత్సవాలను చేస్తున్నందుకే తనపై దాడి చేశారని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్.రంగరాజన్ చెప్పారు. తనపై దాడి చేయడమే కాక అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానన్నారు. పరువు నష్టం దావా వేస్తానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్, నగర ప్రధాన కార్యదర్శి కె.అర్వింద్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న తన ఇంటిపైకి 20మందికిపైగా వచ్చి దాడికి పాల్పడ్డారని తెలిపారు. రామరాజ్యం కోసం ఏం పనిచేస్తున్నావని ప్రశ్నిస్తూ తన భుజంపై నామాలు ఉన్న చోట తన్నారని చెప్పారు. ఉగాదిలోగా సైన్యాన్ని నిర్మించడమేకాక, వనరులు ఏర్పాటు చేయాలని బెదిరించారని గుర్తుచేశారు. తమ టార్గెట్ చినజీయర్ స్వామి అంటూ వెళ్లిపోయారని రంగరాజన్ వివరించారు.


ఆటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నవీన పద్ధతులతో అవకాశాలను పెంపొందించాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నవీన విధానాలతో అవకాశాలు పెంపొందించాలని జెన్‌టీయుహెచ్ మాజీ వీసీ రాజగోపాల్ అన్నారు. ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 'ఎక్స్‌పర్ట్ టాక్' కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు నవీన పద్ధతులతో ఉద్యోగావకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమానంతరం ఆటో ఎక్స్‌పో- 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరబ్రహ్మాం

నూతన పరిశోధనలు రూపొందించాలి

కీసర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సాకేంతికశాస్త్రంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నూతన పరిశోధనలకు రూపకల్పన చేయాలని సైంటిస్ట్ వీర బ్రహ్మాం అన్నారు. భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌పై అంతర్జాతీయ సదస్సు-2025 శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథి వీరబ్రహ్మాం మాట్లాడుతూ.. టెక్నాలజీ పరంగా భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)దే అన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పలు రాష్ట్రాల విద్యార్థులు 1,400 పరిశోధనల థీసిస్‌ను సమర్పించారు. వాటిల్లో 370 పత్రాలను పలు కంపెనీలు ఆమోదించాయి. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎ.సిదార్థ రెడ్డి, డి.కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు రాజ్యాంగానికి విరుద్ధం


పాదయాత్రలో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దేశంలో మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని, మహనీయులను అవమానించేలా వ్యాఖ్యానిస్తూ చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లిలో శనివారం జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గడప గడపకు తిరిగి రాజ్యాంగం, మహనీయుల ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివరించారు. రాజ్యాంగ పరిరక్షణపై నాయకులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మత రాజకీయాలతో బీజేపీ దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతోందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ్య, మల్లె జగన్, శంకర్, షాబుద్దీన్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, కృష్ణానాయక్, శ్రీశైలం, ఖాదర్, జంగయ్య బాల్‌రెడ్డి, సుదర్శన్, యాదయ్య, చంద్రయ్య, సాయిలు, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, రాజు, నర్సింహ, మహేశ్, విజేందర్, అలీం, వెంకట్‌రెడ్డి, నాజర్, ఖాద్రి, మైసయ్య, మల్లయ్య, అంజన్‌రెడ్డి, వెంకటేశ్, మానయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా బీచ్‌లో కేసీఆర్ సైకత శిల్పం

బీఆర్ఎస్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైకత శిల్పాన్ని ఒడిశా గోల్డెన్ బీచ్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి వేయించారు. కేసీఆర్ విశిష్టతను, బీఆర్ఎస్ ప్రస్థానాన్ని వ్యాపింపజేసేందుకే తాను ఇసుకతో ఈ కళారూపాన్ని చేయించానన్నారు. 'కేసీఆర్.. మా కోసం నువ్వు నిలబడ్డావు.. మీ కోసం మేం నిలబడతాం.' ఈ సైకత శిల్ప సారాంశమని నవీన్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు.

- షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి)



ఆంధ్రజ్యోతి విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్న జర్నలిస్టులు, సర్క్యులేషన్ సిబ్బంది

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక పాఠకుల కోసం నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ పోటీలో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులను శనివారం ప్రదానం చేశారు. ఈ పోటీల్లో షాద్‌నగర్ డివిజన్ పరిధి కేశంపేటకు చెందిన కె.వెంకటేశ్, బుచ్చిగూడెంకు చెందిన ఇ.నవీత్ రెడ్డి, కొత్తూర్‌కు చెందిన జి. శ్రీదేవి, షాద్‌నగర్‌కు చెందిన డి.భరత్‌లకు ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు. వీరికి షాద్‌నగర్‌లోని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో బహుమతులను అందజేసి అభినందించారు. పిలిచి బహుమతులిచ్చిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి విజేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు టి.సంజయ్‌కుమార్, ఎల్.మోహన్‌రెడ్డి, వై.శేఖర్‌యాదవ్, ఏసీవో అశోక్, ఎస్ఆర్.శివకుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు



తనిఖీల్లో అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు బేకరీలు, హోటల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం పట్టణంలోని అనంత్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలు తనిఖీలు చేసి మొత్తంగా రూ.11.500 జరిమానా విధించినట్లు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో పర్యావరణ అధికారి శ్రీనివాస్, జవాన్లు వినోద్ కుమార్, శంకర్, రాజు, ఆశయ్య, మహేందర్‌లు ఉన్నారు.

శిథిలావస్థలో బుద్దారం బ్రిడ్జి

- ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా వంతెన
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయాలని కోరుతున్న జనం

పెద్దేముల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుద్దారం వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జిపై సిమెంట్‌బెడ్డు తొలగిపోయి ఇనుపచువ్వలు పైకితేలాయి. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ బ్రిడ్జినిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయారు. వంతెనపైన పైనల్‌లేయర్ వేయలేదు. అయినప్పటికీ వాహనాల రాకపోకలు కొనసాగడంతో బ్రిడ్జిపైన సిమెంట్ తొలగిపోయి ఇనుప చువ్వలు పైకి తేలాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా తేలిన ఇనుపచువ్వలు టైర్లకు తగిలి టైర్లు పగిలిపోయే ప్రమాదం ఉంది. అదేవిధంగా పాతవంతెన చిన్న పాటి వర్షం పడితే చాలు వరదనీరు వంతెనపై నుంచి పారుతుంది. దీంతో వాహనాలు గంటల తరబడి అక్కడే వేచిఉండాల్సి వస్తోంది. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి బ్రిడ్జిపై మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బుద్దారం బ్రిడ్జిపై తేలిన ఇనుపచువ్వలు

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్‌ఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బాలాజీనగర్‌కు చెందిన జూపల్లి ఆరోగ్యం(45) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆరోగ్యం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



బొంరాస్‌పేట్: ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లిలో శనివారం ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బొంరాస్‌పేట్: రైతులు మద్దతు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. బురాన్‌పూర్‌లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు టి.కృష్ణ, డైరెక్టర్ దోమ నర్సింహులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు చెంగోల్‌లో శనివారం తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ సలాం పాషా, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి మజీద్‌ల అధ్యక్షతన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాగప్ప, శ్రీనివాస్, రత్నమాల రాము, హజ్మత్ అలీ, కరీం, తులసీనాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్‌లను డీసీఎంఎస్ ప్రతినిధులు సలాం, భాస్కర్, వెంకటరాజు సన్మానించారు.

మేడ్చల్ టౌన్: డబీల్‌పూర్ సహకారం సంఘం పరిధిలోని కొనాయిపల్లిలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింహులు శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: చెంగోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్

పశుగ్రాసానికి పరేషాన్!

(5వ పేజీ తరువాయి)



జిల్లాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మెదక్, నిజామాబాద్, జనగాం, నల్గొండ జిల్లాల నుంచి ట్రాక్టర్ల ద్వారా గడ్డిని తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఎండు గడ్డి రూ.8 వేలు పలుకుతోంది. పైగా ట్రాక్టర్ కిరాయి అదనంగా చెల్లించాలి. ట్రాక్టర్‌లో మోపులైతే 45, కట్టలైతే 60 నుంచి 70 ఉంటాయి. ప్రస్తుతం పచ్చి మేత కూడా తక్కువగా ఉండటంతో దూర ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని తెప్పిస్తున్నారు. ఇదే అదనుగా ఎండు గడ్డి ధరను అమాంతంగా ధరను పెంచేశారు. అయినాసరే తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నారు. పాడిని కాపాడుకోవడానికి ఎంత ధరైనా చెల్లించి ఎండు గడ్డిని కొనాల్సి వస్తుందని పాడి వ్యాపారులు వాపోతున్నారు. గ్రామాల్లో రైతులు వరి పొలాల కోతకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. కొందరు మాత్రమే మాత్రమే వరిగడ్డి కోసం యంత్రాలను ఉపయోగించకుండా కూలీల ద్వారా కొయిస్తుండటంతో గడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయంగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని ముందు ముందు ఇది మరింత తీవ్రతరం కానుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండు గడ్డి కొరత తీవ్రతరం కాకుండా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని రైతులు, పాడిపరిశ్రమ రైతులు కోరుతున్నారు.

మహిళల అభ్యున్నతికి అధిక నిధులు



మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ సభ్యులు

మర్పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్వాక్రా మహిళల అభ్యున్నతికి కోట్లాది రూపాయల రుణాలను మంజూరు చేస్తోందని మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లేశ్‌యాదవ్, సొసైటీ వైస్‌చైర్మన్ షఫియోద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో శనివారం మండల సమాఖ్య 17వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంఘాలకు కోట్లాది నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళలకు పూర్తి స్థాయి రుణాలను అందించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తోందన్నారు. అనంతరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా అనురాధ, కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా మమతను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నర్సింహులు, ఏపీయం మధుకర్, సీసీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానిపై విమర్శలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు



వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హిందువులపై దాడులకు ప్రధాని మోదీనే కారణమంటూ తీవ్ర విమర్శలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు సదానందారెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో శనివారం యువకుడిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమ్ము కాశ్మీర్‌లోని పహల్గావ్ ప్రాంతంలో ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిస్తున్న సందర్భంలో పూడూరు మండలం మేడిపల్లి కలాన్ గ్రామానికి చెందిన పత్తి మల్లేశం అనే వ్యక్తి సోషల్ మీడియా వేదికగా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, బస్వలింగం, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి, శివరాజు, సామల లక్ష్మి, జగన్నాథ్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



విద్యార్థులతో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. అవుశాపూర్‌లోని ఆల్ఫోర్స్ కళాశాలలో శనివారం ఆయన ఇంటర్ విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాల సందర్భంగా సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

మర్పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆకార్, ఆశా ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యులు భరతనేయుడు అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్‌లు, పట్లూర్ ఆరోగ్య సిబ్బంది మర్పల్లి ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరానికి మండలంలోని 94 మంది దివ్యాంగులను తీసుకొచ్చారు. వారిలో 22 మందికి శస్త్ర చికిత్స కోసం వైద్యులు గుర్తించారు. మరో 12 మందికి రక్తహీనత కారణంగా శస్త్రచికిత్సలను వాయిదా వేశారు. మిగతా వారికి వైద్య పరీక్షలతో పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా, అంగన్‌వాడీ సిబ్బంది, పట్లూర్ వైద్య సిబ్బంది మానస, వర్ష, విజయ్‌కుమార్, అమరేశ్వరి, తిరుపతయ్య పాల్గొన్నారు.

కంది, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు బీట్లు

ధారూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం వ్యవసాయ పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కందులు క్వింటాలుకు రూ.6,500ల నుంచి రూ.7,160వరకు, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,270ల నుంచి రూ.2,340ల వరకు, ధాన్యం 1010రకంకు క్వింటాలుకు రూ.1900ల నుంచి 2,000లు, ధాన్యం(సోనా) క్వింటాలుకు రూ.2,000ల నుంచి రూ.2,180లు, పసుపు(కొమ్ము) క్వింటాలుకు రూ.10,700ల నుంచి రూ.11,600లు, పసుపు గుండు రకం క్వింటాలుకు రూ.10వేల నుంచి 12వేలల వరకు ధరలు పలికింది. కాగా కందులు 22.5 క్వింటాళ్లు, మొక్కజొన్న 132.5క్వింటాళ్లు, ధాన్యం 371.2 క్వింటాళ్లు, పసుపు కొమ్ము 25.2 క్వింటాళ్లు, గుండు రకం 7.8క్వింటాళ్లు క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్ధమ్మ వివరించారు.

కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువులను ఎవరైనా కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. మండలంలోని ఎన్కతలలో 214 సర్వే నెంబర్‌లో గల చిన్న చెరువు ప్రాంతంలో 10 గుంటల భూమి కబ్జాకు గురి కావడంతో ఆర్ఐ గోవర్ధన్, సర్వేయర్ రాందాస్‌తో కలిసి పరిశీలించారు. వివాదాస్పద భూమిలో ఇరిగేషన్ అధికారులతో కలిసి జేసీబీ సాయంతో కాలువ తీసి హద్దులు గుర్తించారు.

ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలని మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాము రవి అన్నారు. రాజకీయంగా, సామాజికంగా చేసిన సేవలను గుర్తించిన ఆసియా ఇంటర్నేషన్ కల్చరర్ రీసెర్చ్(తమిళనాడు) వారు మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లికి చెందిన మాజీ సర్పంచ్ జామురవికి వైస్ చాన్సలర్ చేతులమీదుగా హానరరీ డాక్టరేట్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

బొంరాస్‌పేట్ ఏవోగా పోలప్ప



బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల నూతన వ్యవసాయ అధికారి(ఏవో)గా కె.పోలప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన నారాయణపేట జిల్లాలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తుండగా రెగ్యులర్ స్థానంగా బొంరాస్‌పేట్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జి.తులసి కొడంగల్ మండల వ్యవసాయ అధికారిణిగా కొనసాగుతున్నారు.

భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన



దుండిగల్: ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుండిగల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ధరణి చట్టం రెవెన్యూ అధికారుల చేతులు కట్టేసినట్లు ఉండడంతో రాష్ట్రప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. గండిమైసమ్మ, దుండిగల్ మున్సిపాలిటీలోని బహదూర్‌పల్లి మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో శనివారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. భూభారతి చట్టం రైతులకు అనుకూలంగా ఉందన్నారు. ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ నాయకులు జేమ్స్, సాధు యాదవ్, సురేష్‌లు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వారికి సహకరించారని, కలెక్టర్ ముందే అధికారులను నిలదీశారు. దీంతో కొద్దిసేపు సభాప్రాంగణం ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాష్, దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్ పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సులు

నవాబుపేట: మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో రేపు(సోమవారం) ఉదయం 12గంటలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జయరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దేముల్: పెద్దేముల్‌లో రేపు (సోమవారం) ఉదయం 11గంటలకు భూభారతి పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు కలెక్టర్ ప్రతీక్‌జైన్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లు హాజరవుతారని తెలిపారు.

కోట్‌పల్లి: మండలంలోని బుగ్గపురం డీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం (రేపు) ఉదయం 10.30గంటలకు భూ భారతి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉగ్రవాదంపై పోరాడాలి



వికారాబాద్: కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న వ్యాపారులు

వికారాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారతీయుడిగా ప్రతీఒక్కరు ఉగ్రవాదంపై పోరాడాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ అన్నారు. స్థానిక కొత్తగంజ్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం వ్యాపారులతో కలిసి హనుమాన్ చాలీసా చదివి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ధారూరు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ శనివారం రాత్రి ధారూరు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల పక్షం నాయకులతో కలిసి ధారూరులో కొవ్వొత్తులతో ఐక్యత ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్తూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన మృతులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరా రెడ్డి, బీజేపీ, ఎంఐఎం పార్టీ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం బాధ్యులు, యువజన సంఘాలు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.



కొడంగల్: నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు

కొడంగల్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని రెవెల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమారాజు అన్నారు. దాడుల్లో మృతి చెందిన వారికి శనివారం కొడంగల్‌లో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఫయాజ్, భీమేశ్, అభిషేక్, వసంత పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పలువురు స్థానికులు శనివారం మున్సిపాల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలో అంతర్గత డ్రైనేజీ సిస్టమ్ సరిగా లేక మురుగునీరు నిత్యం రోడ్డుపై పారుతూ పరిసరాలు దుర్గంధభరితం అవుతున్నాయని స్థానికులు తెలిపారు.

మత రాజకీయాలకు దూరంగా ఉండాలి

కోట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు మత రాజకీయాలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్ అన్నారు. మండలంలోని మోత్కుపల్లి, నాసన్‌పల్లి గ్రామాల్లో భారత సంవిదాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

సంక్షిప్తంగా..

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

దుద్యాల: లగచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ ఆధ్వర్యంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులతో చదివించడం, రాయించడం చేశారు. అనంతరం చిన్నారులు, తల్లులకు పాటల పోటీలు నిర్వహించారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

చౌడాపూర్: ఈ నెల 27న (ఆదివారం) వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు.

నేడు తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

తాండూరురూరల్: నేడు(ఆదివారం) తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6, 7వ తరగతులకు అడ్మిషన్లు పొందేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 7వ తరగతి ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్: పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 83వ వారం పూర్తయిన సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు సాంకేతిక పోటీలు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు సాంకేతిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పూడూరు: మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ నుంచి డీపీఎం ఐబీ వీరయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా బేబీ, జయమ్మ, ఆండాలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఏపీఎం బందెయ్య, వీవో, ఏబీలు, సీసీలు పాల్గొన్నారు.

పాలక మండలి నియామక నోటిఫికేషన్ జారీ

తాండూరు రూరల్: యాలాల మండలం రసూల్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి నియామకం కోసం దేవాదాయ శాఖ హైదరాబాద్ నుంచి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈవో నరేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

30 సంవత్సరాలుగా కరాటే సేవలు

వికారాబాద్: 30ఏళ్లుగా చిన్నారులకు కరాటేలో ఉచితంగా శిక్షణ ఇస్తున్న మాస్టర్ కాజాపాషా సేవలు మరువలేనివని మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ అన్నారు. మేరి ఏ నాట్స్ గ్రౌండ్‌లో జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఫౌండర్ టెక్ డైరెక్టర్ మాస్టర్ ఖాజా పాషాతో పాటు మాస్టర్ విజయ్‌ల ఆధ్వర్యంలో చిన్నారులకు కరాటే శిక్షణ ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

పూలే, అంబేద్కర్ జనజాతర సభను జయప్రదం చేయాలి

పెద్దేముల్: పూలే, అంబేద్కర్ జనజాతర సభను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పలి మల్కయ్య పిలుపునిచ్చారు. ఈనెల 30న తాండూరుపట్టణంలో జరిగే జనజాతర సభ కరపత్రాలను మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం కేవీపీఎస్ నాయకులతో కలసి విడుదల చేశారు.

బాలికలకు కరాటే శిక్షణ

తాండూరు: తాండూరు హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు బాలికలకు మే 1వ తేదీ నుంచి ఉచిత కరాటే శిక్షణను నిర్వహిస్తున్నట్లు హిందూధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్ వెల్లడించారు. తాండూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం ఉచిత కరాటే శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసక్తి ఉన్న బాలబాలికలు సెల్ నెం.9030056755, 6300383211 లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ విద్యా సంస్థల ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, మణిమాల పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

కొడంగల్ రూరల్: ఈయంఆర్ఐ జీహెచ్ఎస్ (108) సంస్థలో ఈయంటీ ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ తోకల శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9154041913, 97039558721 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ముదిరాజ్‌ల డిమాండ్లను నెరవేర్చాలి

దౌల్తాబాద్: ముదిరాజ్‌ల డిమాండ్‌లను నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్‌ల సమావేశం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకతీతంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో ఉన్న ముదిరాజ్‌లను రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు కూరవెంకటయ్య, రెడ్డి శ్రీను, కోట్ల హనుమంతు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.


భారత్ సమ్మిట్‌లో తాండూరు ఎమ్మెల్యే



భారత్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే

తాండూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ నగరం హెచ్ఐసీసీ లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. శనివారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ సమ్మిట్ హైదరాబాద్‌లో నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరిగి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పరిగి మండలంలో సమావేశం నిర్వహించి మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ప్రజా సంఘాల కన్వీనర్‌గా కే.మంగమ్మను ఎన్నుకున్నారు. అదేవిధంగా పద్మమ్మ, రవి, మల్లేశం, బాలయ్య, రామస్వామి, జయమ్మను మండల కమిటీలోకి తీసుకుంటూ 9 మందిని ఎన్నుకున్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



టేకులపల్లిలో మల్లన్నస్వామికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లిలో మల్లన్న స్వామికి శనివారం భక్తులు బోనాలు నిర్వహించారు. గొర్ల బీర్ల డోలు దంతన్‌పల్లి నర్సింహ, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా మల్లన్నస్వామికి అన్నం, పెరుగు, నూనె, పాలేలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మల్లన్న ఒగ్గుకథ, కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల కురుమ సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న బహిరంగ సభలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరుతు బీఆర్ఎస్‌కేవీ రూపొందించిన పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి శనివారం ఆవిష్కరించారు.

నిరుపేదల సొంతింటి కల నిజం చేస్తాం

వికారాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుపేదల సొంత ఇంటి కలను నిజం చేస్తామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో ఈదురు గాలులతో దెబ్బతిన్న ఇళ్లను స్పీకర్ ఆదేశానుసారం శనివారం వెళ్లి పరిశీలించారు.